Andhra Jyothi DT 28/06/15

# మెట్రోకు 'పోచంపల్లి చీర' సింగారం

**స్టేషన్ల వద్ద డిజైన్లు : మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

**ఆంధ్రజ్యోతి, హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రోకు సరికొత్త సింగారాలు అమరుతున్నాయి. ఉప్పల్ స్టేషన్ వద్ద సైడ్‌వాక్‌కు పోచంపల్లి చీరలాంటి డిజైన్‌ను సమకూర్చారు. నాగోల్ స్టేషన్ వద్ద ఊదా, నల్లరంగు టైల్స్ వేయాలని నిర్ణయించారు. ఈ తరహా డిజైనింగ్ కోసం ఆరు మెట్రోస్టేషన్లను ఆర్కిటెక్టులకు అప్పగించారు. మెట్రోస్టేషన్లన్నింటి వద్ద సైడ్‌వాక్‌లకు స్ట్రీట్ ఫర్నిచర్, పచ్చదనం, సీటింగ్ ఏర్పాట్లు ఉంటాయని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మెట్రో స్టేషన్లన్నీ బాగానే ఉన్నా, అప్రోచ్ రోడ్లను మాత్రం సరిగా పట్టించుకోలేదని, అందుకే ఇప్పుడు ప్రతి సాధారణ స్టేషన్‌కూ రూ.60 కోట్లు, పంజాగుట్ట లాంటి ప్రత్యేక స్టేషన్లు, పెరేడ్ గ్రౌండ్స్, ఎంజీబీఎస్, హైటెక్‌సిటీల వద్ద ఉండే జాయింట్ స్టేషన్లకు సుమారు రూ.100 కోట్ల చొప్పున ఎల్అండ్‌టీ వెచ్చిస్తోందని ఆయన చెప్పారు.

ప్రధాన క్యారేజీవేను వీలైన చోట్ల ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందీ లేకుండా వేరు చేస్తున్నామని ఆయన వివరించారు. ప్రతి స్టేషన్‌కూ ఒక్కో లక్షణం ఉంటుందని, ఉప్పల్ స్టేషన్ వద్ద తాము ఎరుపు, ఊదా, నలుపు పోచంపల్లి చీర డిజైన్‌ను ఎంచుకున్నామని అన్నారు. నాగోల్ వద్ద ఊదా, నలుపు డిజైన్లు ఉంటాయన్నారు. ఇలా ప్రతి స్టేషన్‌కూ వేర్వేరు డిజైన్లు ఉంటాయని, ఇప్పటికే ఆర్కిటెక్టులు, కళాకారులు తమ పనులు మొదలుపెట్టారని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు.



ఉప్పల్ స్టేషన్ వద్ద సైడ్‌వాక్‌కు పోచంపల్లి చీరలాంటి డిజైన్